76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో
ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న ఎ.పి. ఎన్.ఆర్.టి. ఐకాన్
టవర్స్ భూమి పూజకు విచ్చేయుచున్న ఎన్.ఆర్.ఐ.
మిత్రులకు,అధికార,అనధికార, రాజకీయ ముఖ్యులకు,
ప్రజలకు నా హార్దిక స్వాగతం.



హుస్సేన్ ఖాన్
ఎడిటర్ - రాజధాని వార్తలు
చైర్మన్ - అమరావతి వెల్ఫేర్ కౌన్సిల్


# రాజధాని వార్తలు


Voice of Voiceless




అమరావతి సంపుటి : 3 సంచిక 40, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 25 - ఆదివారం 1 జూలై, 2018











## రాజధాని మణిహారం

# ఏపీఎన్ఆర్టీ ఐకాన్ టవర్

**రాజధాని డెస్క్ :** రాజధాని అమరావతికి మణిహారంగా ఏపీఎన్ఆర్టీ ఐకాన్ టవర్ నిర్మాణం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఎన్ఆర్టీ సంయుక్తంగా ఈ నిర్మాణాన్ని చేపట్టనుంది. ఏపీఎన్ఆర్టీ ప్రపంచంలోని 110 దేశాల్లో 80 వేల మంది ప్రవాసాంధ్రులను సభ్యులుగా కలిగి ఉంది. ఉచిత బీమా, పుణ్యక్షేత్రాల సందర్శన, పెట్టుబడులు పెట్టడంలో సహకారం వంటి అనేక రకాల సేవలను ఏపీఎన్ఆర్టీ అందిస్తోంది. నవ్యాంధ్రలో సాఫ్ట్‌వేర్ అనుబంధ రంగాల కంపెనీల స్థాపనకు స్పేస్ల కొరత ఉంది. ఎన్ఐఆర్టీ అందిస్తున్న అనేక రాయితీలతో 65 సాఫ్ట్‌వేర్ కంపెనీలు, 16 ఐటీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు మన రాష్ట్రంలో ఏర్పాటయ్యాయి. 1.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎన్ఆర్టీ ఐకాన్ భవనం నిర్మించబడుతోంది. దీనిలో 100కు పైగా అంతర్జాతీయ స్థాయి సాఫ్ట్‌వేర్ కంపెనీలు నెలుకొల్పే అవకాశం ఉంది.

రాజధాని ప్రాంతమైన రాయపూడిలో సీఎం చంద్రబాబు 22న భూమి పూజ చేశారు. మంత్రులు, అధికారులు, ప్రముఖులతోపాటు అనేక దేశాల ప్రవాసాంధ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో ఐటీ కంపెనీలు, నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, స్విమ్మింగ్ ఫూల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లతో ఈ సముదాయం అమరావతికి ప్రత్యేకంగా ఆకర్షణగా నిలవనుంది. ఈ టవర్స్‌ను ఎక్సో స్కెలిటన్ విధానంలో నిర్మిస్తున్నారు. ఫ్లోర్‌ల మధ్య కాంక్రీట్ పిల్లర్లు, స్థంభాలు ఉండకపోవడం వల్ల మరో 6శాతం స్థలం లభ్యమవడమేకాకుండా నిర్మాణ సమయం కూడా తక్కువగా ఉంటుంది. ఇందుకోసం రూ. 400 కోట్లు కేటాయించి 5 ఎకరాల్లో లక్షా ఎనిమిది వేల చదరపు మీటర్ల స్థలం అందచేసే 33 అంతస్తుల భవనంలో పార్కింగ్ కోసం ప్రత్యేకంగా 3 సెల్లార్లు ఉండనున్నాయి. గ్రీన్ బిల్డింగ్ విధానంలో పర్యావరణ అనుకూలంగా నిర్మించడం వల్ల అన్ని ఫ్లోర్‌లల్లో ఉద్యావనాలు ఉండటంతో ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంటాయి. ఈ భవంతిలో నివాస సముదాయాలు, ఐ.టి.కంపెనీలు, షాపింగ్ కాంప్లెక్స్ లు, గేమింగ్ జోన్స్, ఓపెన్ ఎయిర్ థియేటర్లు, కన్వెన్షన్ హాల్స్, రెస్టారెంట్ల వంటి సదుపాయాలు ఏర్పాటుచేయనున్నారు. మధ్యలో ఉండే గ్లోబ్ వంటి ఆకారంలో ఏర్పాటు చేస్తున్న రివాల్వింగ్ రెస్టారెంట్ ఈ భవనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అమరావతిని ను గుర్తు చేస్తూ 'ఎ' ఆకారంలో ఉండే ఈ టవర్ లో మురుగునీటి శుద్ధి కేంద్రం ఉండటంవల్ల, ఆ శుద్ధి చేసిన నీటిని భవనంలోని మొక్కలకు వాడే అవకాశం కలుగుతుంది. ఎన్.ఆర్.టి ల నిధులతో, వారికోసమే నిర్మించనున్న ఈ ఎన్.ఆర్.టి టవర్ వల్ల ప్రత్యక్షంగా 5 వేలమందికి, పరోక్షంగా 30 వేలమందికి ఉద్యోగాలు లభించగలవని ఎన్.ఆర్.టి తెలుపుతోంది. ఈ భవనంలోని నివాస, కార్యాలయ ప్రాంతాలను కేవలం ఎన్.ఆర్.టి లకు మాత్రమే కేటాయించగా, తమకు కూడా స్థలం కేటాయించాలని ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 500 మంది రిక్వెస్టులు పంపారు.

టవర్ ముందు భాగంలో ప్రత్యేక పెవిలియన్ ను ఏర్పాటుచేసి, 40 దేశాల జాతీయపతాకాలను 50 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్నామని, ఇది విదేశాలలో ఉన్న తెలుగువారందరూ మనవారేనన్న సందేశాన్ని అందిస్తుందని డాక్టర్ రవి పి వేమూరు తెలిపారు.

# ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ..

**రాజధాని ప్రతినిధి, విశాఖ :** తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌ను లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలు, మన్యంలో వైద్య సౌకర్యాలను పెంచామని గుర్తు చేశారు. గర్భిణుల ఆరోగ్యం, చిన్నారుల పౌష్టికాహారంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. సాంక్రమిక వ్యాధులు, దోమల ద్వారా వచ్చే జబ్బుల్ని నియంత్రిస్తామని స్పష్టంచేశారు. గురువారం ఆయన విశాఖలోని మధురవాడలో అమృత వ్యాలీ, ఏపీ ఆరోగ్య ఉత్సవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సాంకేతికత కీలక భూమిక పోషిస్తుందన్నారు. వైద్య వ్యవస్థలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం చాలా ముఖ్యమన్నారు. గతంలో కేన్సర్,గుండె జబ్బుల రోగులుబయటకు వెళ్లి చికిత్సలు చేయించుకునే వారని, ఇంకొందరుఅమెరికాకు వెళ్లేవారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు మన వద్దే ఆధునిక చికిత్స లభ్యమవుతోందని వివరించారు. నీరు, అపరిశుభ్రమైన పరిసరాల వల్ల వచ్చే వ్యాధులపై పూర్తిగా దృష్టిసారించామని తెలిపారు. మరో రెండేళ్లలో దోమల ద్వారా వచ్చే వ్యాధులన్నింటనీ నియంత్రిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.



# ఆంధ్రప్రదేశ్ ప్రయారిటీస్ ఎమినెంట్ ప్లానల్ ప్రతినిధి బృందంతో ఇన్చార్జి సిఎస్ సమావేశం

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రాన్ని సామాజికంగా ఆర్థికంగా దేశంలో అగ్రభాగాన నిలిపేందికు వివిధ ప్రాధాన్యతా రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై ఒక సమగ్ర కార్యాచరణ నివేదికన త్వరగా సిద్ధం చేయాలని సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రయారిటీస్ ఎమినెంట్ ప్లానల్ ప్రతినిధి బృందంతో సమావేశమైన ఇన్ చార్జి సిఎస్ అనిల్ చంద్ర పునేఠ సూచించారు. టాటా ట్రస్ట్ మరియు కొపెన్ హేగన్ కన్సన్సియస్ భాగస్వామ్యంతో ఇప్పటికే గుర్తించిన 77 ప్రాధాన్యాతాంశాల్లో మెరుగైన వృద్ధిని సాధించడం ద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా,సామాజికంగా దేశంలో అగ్రస్థానాన నిలిపేందుకు కృషి చేయాల్సి ఉందని పేర్కొన్నారు.పౌష్ఠికాహారం,ఆరోగ్యం,విద్య,పారిశుధ్యం,వ్యవసాయం తదితర అంశాల్లో మరింత అభివృద్ధి సాధనకు టాటా ట్రస్ట్ భాగస్వామ్యంతో చేపట్టనున్న ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈప్రాజెక్టు అమలుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను మరియు ఇందుకు సంబంధించిన నిధులు లభ్యతకు సంబంధించిన వివరాలను త్వరగా సిద్ధం చేయాలని చెప్పారు.నెల రోజుల్లోగా సంబంధిత శాఖలతో సమావేశమై వివిధ అంశాలను పరస్పరం చర్చించి వారి సూచనలు,సలహాలను తీసుకోవాలన్నారు.సంబంధిత శాఖలు వారికి పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్యానాద్ దాస్,సంక్షేమశాఖల ముఖ్య కార్యదర్శి ఎస్ ఎస్ రావత్,వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి,రాజశేఖర్,స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యదర్శి కె.సునీత తదితరులు ఎమినెంట్ ప్యానల్ ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

SRM UNIVERSITY ACADEMIC AND ADMINISTRATIVE BLOCK - AMARAVATI



## శుభాకాంక్షలు

ఎపిఎన్ఆర్‌టి ఐకాన్ టవర్స్‌కు శుక్రవారం జరుగుతున్న శంఖుస్థాపన కార్యక్రమం పట్ల నేను ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని రాయపూడిలో అటువంటి సదుపాయాన్ని కల్పించడం ఒక చారిత్రాత్మకమైన, శాశ్వతంగా గుర్తుంచుకో దగిన అంశంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేస్నున్నత దార్శనికత కలిగిన మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎపిఎన్ఆర్‌టి అధ్యక్షులు డాక్టర్ రవి వేమూరి గారికి ఇవే నా అభినందనలు. ప్రపంచ వ్యాప్తంగా 110 దేశాల్లో నివసిస్తున్న తెలుగువారు ఎపిఎన్ఆర్‌టిలో సభ్యులుగా ఉండటం కూడా నాకు సంతోషాన్ని కలిగిస్తోంది.

మీ
ప్రొఫెసర్ డి.నారాయణరావు,
ప్రొ-వైస్ ఛాన్సలర్
ఎస్ ఆర్ ఎం విశ్వవిద్యాలయం, ఏపి-అమరావతి



## యోగాతో ప్రశాంతత

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** అమరావతి ప్రజా దర్బార్ హాలులో ఆయుష్ విభాగం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. 69 ఏళ్ల వయసులోనూ ఓ యువకునిలా అన్ని ఆసనాలను సునాయాసంగా వేసిన ముఖ్యమంత్రి అందరినీ అబ్బురపరిచారు. ప్రతిరోజూ గంట పాటు యోగా చేయడం ఎంతో ప్రశాంతత ఇస్తుందని అన్నారు. యోగా వారసత్వ సంపద అని.., మనిషి మనిషిగా బతకాలంటే యోగా-ధ్యానం గొప్ప సాధనాలన్నారు. సమాజంలో అందరం ఆనందం, ఆరోగ్యం మరచి డబ్బులు వెంటపడి అనర్థాలు కొనితెచ్చుకుంటున్నామని చంద్రబాబు అన్నారు. కుటుంబ వ్యవస్థతో ఎన్నో ఒత్తిళ్లకు దూరం కావొచ్చని.... నిత్య జీవితంలో యోగా-కుటుంబ వ్యవస్థ ఒక భాగం కావాలన్నారు. ప్రకృతితో అనుసంధానమై యోగా చేస్తే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ప్రస్తుతం శారీరక వ్యాధుల కంటే మెదడుకు సంబంధిత వ్యాధులు ఎక్కువ వస్తున్నాయని...

- మిగతా 2 లో







AMARAVATHI WELFARE COUNCIL
Wishes A Grand success of APNRT
Icon towers Foundation stone
laying ceremony

amaravathiwelfarecouncil
76809 94755,
88861 11881
awcap.org
amaravathiwelfarecouncil@gmail.com
6-45/1, Rayapudi(Amaravathi)
Guntur dist. AP- 522237

# సతమతమవుతున్న సర్కారీ బడులు

**సమస్యల వలయంలో సర్కారీ బడులు కొట్టుమిట్టాడుతున్నాయి. పెచ్చులూడిన తరగతిగదులతో విద్యార్థులు నరకం అనుభవిస్తున్నారు.... ఎప్పుడు మీదపడతాయోనని భయపడుతున్నా రు... ఉపాధ్యాయురాలు సైతం పాఠాలు చెప్పేందుకు ఆందోళన చెందుతున్నారు... కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతామని చెప్తున్న పాలకులు అటువైపే చూడడం లేదు... దీనికితోడు విద్యార్థులకు చదువులు చెప్పాల్సిన ఉపాధ్యాయులే వారితో తరగతి గదులు శుభ్రం చేయిస్తున్నారు.**



- పెచ్చులూడిపడుతున్న తరగతి గదులు
- క్లాసులకు వెళ్లాలంటే భయపడుతున్న విద్యార్థులు
- విద్యార్థినులతో గదులు శుభ్రం
- పట్టించుకోని అధికారులు
- ప్రకటనలకే పరిమితమైన పాలకులు

**రాజధాని ప్రతినిధి, భట్టిప్రోలు :** విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన సర్కార్ పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలుకున్నాయి. చాలీచాలని తరగతి గదులు, పూర్తి కాని అదనపు గదులు, శిథిలావస్థకు చేరుకున్న భవనాలు, అపరిశ్రభత, తాగునీటి సమస్యలతో మండలంలోని పాఠశాలలు విద్యార్థులను స్వాగతిస్తున్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలను పున:ప్రారంభించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని సౌకర్యాలతో మెరుగైన విద్యనందిస్తామంటూ ప్రతి సంవత్సరం ప్రజాధనాన్ని ఖర్చు చేసి ప్రచారం నిర్వహిస్తున్న పాలకులు, అధికారులు ఆయా పాఠశాల్లోని సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందుతున్నారు. మండలంలో 54 పాఠశాలలు ఉన్నాయి. వెల్లటూరు, పెసర్లంక, ఐలవరం, పల్లెకోన, పెదపులివర్రు గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పెసర్లంక పల్లెపాలెం, ఓలేరు వెంకటరాజు నగర్, అక్కివారిపాలెం, జిలుగువారిపాలెం గ్రామాల్లోని పాఠశాలలు లోతట్టుగా ఉండడంతో వర్షం కురిస్తే రోజుల తరబడి నీరు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పెసర్లంక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ఆవరణలోని ప్రాథమిక పాఠశాల, పల్లెపాలెం పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో క్లాసులకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు భయపడుతున్నారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేస్తా మంటూ ఊదరకొడుతున్న నాయకులు, విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాల లపై నిర్లక్ష్యానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.... ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం కాకుండా తగిన చర్యలు తీసుకొని పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగు పర్చాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఎయిడెడ్ పాఠశాలల పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. ఆయా గ్రామాల్లోని పలువురు దాతలు అందించే సాయంతో అరకొర సౌకర్యాలు కల్పిస్తున్న యాజమాన్యాలు మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాయి. ఏది ఏమైనప్పటికి పాలకులు, అధికారులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పని పిల్లలుగా విద్యార్థులు**

మంగళవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో ఆటపాటలకు గుడ్ బాయ్ చెప్పి ఉత్సాహంగా పాఠశాలకు వెళ్ళిన విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థులను బాలకార్మికులుగా మార్చారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులు తరగతి గదులను నీటితో కడుగుతూ కప్పించగా మరి కొన్నిచోట్ల చీపురు పట్టి బూజు దులుపుతూ దర్శనమిచ్చారు. ఓ గ్రామంలోనేతై వేసవి సెలవులు అయిపోయాయిగా ఈ రోజే పాఠశాల తెరిచాముగా పిల్లలచేత బూజు దులిపిస్తున్నామంటూ ఉపాధ్యాయులే తెలిపారు.

# అలమటిస్తున్న భారతీయులు



- కటిక దారిద్ర్యంలో 27 కోట్లమంది
- దళితుల స్థితి మరీ దారుణం
- యూపీ,బీహార్, రాజస్థాన్‌లలో దయనీయం
- ప్రపంచబ్యాంకు నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ :** 2012నాటికి భారతదేశంలో27కోట్లమంది తీవ్రమైన పేదరికంలో ఉన్నారని, ఇందులో అత్యధిక సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు పేదరికంతో బాధపడుతున్నారని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ఒకటి తెలిపింది. 20 04 -11 మధ్య భారతదేశంలో చోటు చేసుకున్న పరిణామాల్ని లెక్కులోకి తీసుకొని 2012 నాటి గణాంకాల్ని విడుదల చేస్తున్నామని ప్రపంచబ్యాంకు తెలియజేసింది. పేదల్లో అత్యధిక సంఖ్యలో ఎవరున్నారు? వారు ఎక్కడ జీవిస్తున్నారు? వారు దేనిపై ఖర్చు చేస్తున్నారు? వంటి వివరాల్ని ఈ నివేదికలో తెలియజేశారు. నిజానికి గత నాలుగు సంవత్స రాలుగా పేదరికం బాగా పెరిగిందని అనేక సర్వేలు వెల్లడించాయి. ముఖ్యంగా నోట్లరద్దు తర్వాత ఇది మరింత తీవ్రతరమైంది. కానీ ప్రపంచబ్యాంకు ఈ కాలానికి సంబంధించిన తాజా నివేదిక ఇంకా రూపొందించలేదు. 2012 నాటికి భారతదేశంలో ప్రపంచ దారిద్ర్యరేఖకు దిగువన 27కోట్లమంది ఉన్నారు. అంటే ప్రతీ ఐదుగురు భారతీయుల్లో ఒకరు పేదరికంతో బాధపడుతున్నారు. మొత్తం పేదల్లో 62 శాతంమంది తక్కువ ఆదాయం కలిగిన ఉత్తరప్రదేశ్(6కోట్లమంది), మధ్యప్రదేశ్ (2.4కోట్లు), బీహార్(3.6కోట్లు), రాజస్థాన్ (కోటి మంది), చత్తీస్‌గఢ్(కోటిమంది), జార్ఖాండ్ (1.3కోట్లు), ఒడిశా(1.4కోట్లు) వంటి రాష్ట్రాల్లో జీవిస్తున్నారు. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలు పేదరికానికి నిలయాలుగా మారాయి. మొత్తం పేదల్లో 80శాతం మంది గ్రామాల్లో బతుకుతున్నారు.

**ఆహారంపై అత్యధిక ఖర్చు**

అందునా చిన్న చిన్న గ్రామాల్లో 27శాతం, పెద్ద గ్రామాల్లో 19శాతం, చిన్న పట్టణాల్లో 17శాతం, పెద్ద నగరల్లో 6శాతం మంది పేదరికంలో కూరుకుపోయి ఉన్నారు. ఎస్టీల్లో 43శాతంమంది, ఎస్సీల్లో 29శాతం మంది, ఓబీసీల్లో 21శాతంమంది, ఇతర కులాల్లో 12 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. పేదలు తమ ఆదాయంలో 56శాతం ఆహారంపై ఖర్చుచేస్తున్నారు. గ్రామీణ పేదల్లో అత్యధికులు దినసరి కూలీ చేసుకొని జీనిస్తున్నారు. వ్యవసాయేతర రంగంలో 17శతం మంది, వ్యవసాయ దినసరి కూలీలుగా 34శాతంమంది ఉన్నారు. స్థిరమైన స్వల్పమొత్తంలో నెలఆదాయం కలిగిన పేదలు కేవలం 4శాతం మాత్రమే. అదే అర్బన్ ప్రాంతాల్లో పేదలు చిన్న చిన్న వృత్తులు చేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నారు. అలాగే వ్యవసాయేతర పనుల్లో కూలీలుగా మారుతున్నారు.

# పుస్తకాలు ఏవీ?

- కావాల్సింది 2.18 కోట్లు
- 20 నుంచి 40 శాతమే పంపిణీ
- నేటికీ గ్రామాలకు చేరని వైనం
- టెండర్లలో జాప్యమే కారణం
- ఆర్భాటంగా బడిబాట ప్రచారం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. కాని నేటికీ ఒక్క పాఠశాలకూ పాఠ్య పుస్తకాలు చేరలేదు. బడులు తెరిచిన రోజునే విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం గొప్పంగా ప్రకటించింది. కాని జిల్లా కేంద్రాల నుంచి మండలాలకే 20 శాతం నుంచి 40 శాతం మేర కూడా పుస్తకాలు చేరలేదు. అంటే ఆయా మండలాల్లోని గ్రామాలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు చేరటానికి కనీసం వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో అప్పటి వరకు విద్యార్థులకు ఏం చెప్పాలని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మన ఊరు- మన బడి పేరుతో ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపట్టినా, పాఠ్య పుస్తకాలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవటం గమనార్హం. దీంతో విద్యా సంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొనునున్నారు. రెండు రోజుల నుంచే పాఠ్య పుస్తకాల బట్వాడాను అధికారుల హడావుడి ప్రారంభించారు. ఒక వైపున బడిబాట పేరుతో ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ, మరో వైపు పుస్తకాల పంపిణీ ని మరవటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రెండు రోజుల క్రితమే జిల్లా కేంద్రాలకు పాఠ్య పుస్తకాలు చేరినట్లు సమాచారం. తొలుత దూర ప్రాంత మండలాలకు పుస్తకాలను బట్వాడా చేస్తున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పలు యాజమాన్యాల కింత 61,529 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 642 ప్రభుత్వ పాఠశాలలు, 38,712 జిల్లా, మండల పరిషత్, 32 రెసిడెన్షియల్, 160 మోడల్ స్కూల్స్, 352 కేజీబీవీ స్కూళ్లు, 2,119 మున్సిపల్ స్కూళ్లు, ఇతరవి 3,288, ప్రైవేటు పాఠశాలలు 16,274 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 69.83 లక్షల మంది విద్యార్థులుండగా, 2,88,378 ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రభుత్వ, పలు యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలల్లోని ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థులకు 2.88 కోట్ల పాఠ్య పుస్తకాలు అవసరమని విద్యాశాఖ అంచనా వేసింది. లక్షలాది మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు లేకుండా విద్యా సంవత్సరాన్ని ఏవిధంగా ప్రారంభిస్తారనే ప్రశ్నలు వ్యక్తంమవుతున్నాయి.

**ముద్రణలో జాప్యం వల్లేనా...**

2018-19 విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్య పుస్తకాల ముద్రణలో జాప్యం జరగటం వల్లే ఈ ఏడాది పుస్తకాల పంపిణీ ఆలస్యమవుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంనాటికే అన్ని స్కూళ్లకు పుస్తకాలను బట్వాడా చేయాల్సి ఉంది. గత ఏడాది కూడా ఇదే సమస్య ఉండగా, అధికారులు ఏమాత్రం సరిదిద్దుకోకపోగా అదే తప్పును కొనసాగించటం పలు విమర్శలకు తావిస్తోంది. మూడు నెలల క్రితమే పాఠ్య పుస్తకాల ముద్రణ టెండర్‌ను విద్యాశాఖ ఖరారు. చేసిందని అధికారులు చెబుతున్నారు. ఇది కూడా సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేయటం వల్లే ముందుకు కదిలిందని, లేకపోతే మరింత జాప్యమయ్యేదంటున్నారు. విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు 2.18 కోట్ల పుస్తకాలతోపాటు విక్రయం కోసం మరో 50 లక్షలు అవసరమని నిర్ణయించారు. జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలకే ఆలస్యంగా పుస్తకాలు వెళితే, మారుమూలన ఉన్న గిరిజన ప్రాంతాలకు ఎప్పటికి చేరతాయో అర్థంకాని ప్రశ్నగా ఉంది.

**టెండర్లు పిలవటంలో ఆలస్యం**

పాఠ్య పుస్తకాల ముద్రణకు సంబంధించి ప్రభుత్వం టెండర్లను ఆలస్యంగా పిలవటం వల్లే ఈ ఇబ్బందులు ఎదురైనట్లు అధికారులు చెబుతున్నారు. పాఠ్య పుస్తకాల ముద్రణ కోసం మార్చి 21న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ టెక్ట్స్ బుక్స్ ప్రెస్ టెండర్లను ఆహ్వానించింది. జిల్లాల వారీగా టెండర్లను దక్కించుకున్న సంస్థలు ముద్రించిన పుస్తకాలను జిల్లా కేంద్రాల నుంచి మండలాలకు పంపించే షెడ్యూల్‌ను కూడా ఇచ్చింది. గత నెల 15 నుంచి 30వ తేదీకే పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేయాల్సి ఉంది. టెండర్లలో జరిగిన జాప్యం ప్రభావం ముద్రణపైనా పడిందని, అందుకే ఈ సారి పుస్తకాల పంపిణీ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కొన్ని జిల్లాల కలెక్టర్లు పాఠ్యపుస్తకాలపై జిల్లా విద్యాశాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినా పట్టించుకోలేదనే విమర్శలూ లేకపోవలేదు.

## రాజధాని వార్తలు కలం

# మనస్సాక్షిలేని మంత్రులు

దేశంలోనూ, రాష్ట్రంలోనూ గత నాలుగేళ్లుగా గిరిజనులు, దళితులపై దాడులు పెరిగాయన్నది వాస్తవం. దాడులను నిరోధించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు శూన్యం. ఆంధ్రప్రదేశ్ దళితులపై దాష్టికాలను ఉధృతం చేసి ఐదోస్థానానికి ఎగబాకింది. మొదటి స్థానంలో ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, హర్యానా, మధ్యప్రదేశ్ ఆపై ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. అంటే దక్షిణ భారత దేశంలో ఆంధ్రప్రదేశ్ దళితుల దాష్టికాల్లో ముందుంది.

ఈ నేపథ్యంలో దళిత తేజం పేరుతో ప్రభుత్వం జనవరి 26 నుంచి ప్రారంభించిన కార్యక్రమాన్ని ఈనెల 30న ముగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని లక్షమంది దళితులతో ఎన్నడూలేనంత ఘనంగా నిర్వహిస్తామని మంత్రులు కళావెంకట్రావు, నారాయణ, నక్కా ఆనందబాబులు వివరించారు. దాష్టికాలు జరిగినప్పుడు నోరు తెరవని ఈ మంత్రులంతా దళితులను గొర్రెల మందల్లా ఈ కార్యక్రమానికి తీసుకెళతారన్నమాట.

రాష్ట్రంలో అధికార ప్రతిపక్షలకు చెందిన ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు 32 మంది ఉన్నా ఏనాడు దాడులపై స్పందించిన దాఖలాలు లేవు సరికదా.. మంత్రులు, ముఖ్యమంత్రులు, సంస్థల ఛైర్మన్లు ఈసడించుకుంటే ఖండిచే సత్తా కూడా లేదు. ఈ మట్టి మనుష్యులు మాత్రం మంత్రుల కార్యక్రమాలను విజయవంతం చేసి.. ఎన్నికల్లో ఓట్లు వేయాలి.

ఏదేశ ప్రజలు స్వాతంత్ర్య, సౌభాగ్యాలతో విలసిల్లాలని, తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించాడో.. ఎక్కడ ప్రజలు శాంతి భద్రతలతో వర్థిల్లి ప్రపంచానినికి దిక్చూచీగా వ్యవహరించాలని కోరాడో ఆయన శిలా విగ్రహాన్ని పశ్చిమ గోదావరి జిల్లా గరకపర్రుల్లో పెట్టకుండా చేస్తే ఈ ప్రభుత్వం ఏం చేసింది ? అక్కడకు వెళతానన్న దళిత, పౌర, ప్రజాసంఘాల నేతలను కూడా అడ్డుకుంది. స్థానిక ఆసాములు పక్షాన్నే నిలిచింది... ఇదే రాజధాని ప్రాంతం నుంచి వెళ్లిన హైద్రాబాద్ సెంట్రల్ వర్సిటీ రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల ఇద్దరు కేంద్ర మంత్రుల అరాచానికి బలైపోతే ఒక్కమాట కూడా మాట్లాడలేదు మన మంత్రులు. ఇదే సమయంలో జిల్లా కలెక్టర్ షెడ్యూలు కులంగా నిర్థారిస్తూ ధృవీకరణ పత్రం ఇస్తే బీజేపీతో కుమ్మక్కయిన ప్రభుత్వం కేంద్ర మంత్రులైన దత్తాత్రేయ (అప్పటి కేంద్రసహాయ మంత్రి), స్మృతీ ఇరానీలను దళిత చట్టాల నుంచి కాపాడేందుకు వడ్డెర కులంగా మార్చారు. అలాగే విశాఖలోని జెర్రిపోతులపాలెం, రాజధాని ప్రాంతం అని ప్రతి క్షణం మంత్రులంతా కలవరించే గుంటూరు జిల్లాలోని పెదగొట్టిపాడు దళితులపై దాష్టికాలు జరుగుతుంటే ఈ ప్రభుత్వం ఏం చేసింది ? ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీల గోరక్షక ఉన్మాదం తలకెక్కించుకుని చచ్చిన ఆవుల చర్మాన్ని తీసినందుకు తూర్పుగోదావరి జిల్లాలో దళితులపై దాడి జరిగితే రాష్ట్ర హోం మంత్రి ఎందుకు అక్కడకు వెళ్లలేదు..? ముఖ్యమంత్రి ఎందుకు ఆ ఘటనపై స్పందిస్తూ హెచ్చరికలు జారీ చేయలేదు..?

మహోత్కృష్టమైన, మేథాసంపత్తిగల మనిషిగా పుట్టినందుకు గర్వపడకుండా డబ్బులేకపోతే మాత్రం ఎస్సీ,ఎస్టీలో ఎవరు పుట్టాలను కుంటారు అనే ముఖ్యమంత్రి పాలనలో దళితులపై దాష్టికాలు మామూలే అనుకోవాలా ? శుభ్రంగా ఉండరు,చదువుకోరు అనే మంత్రి రాజ్యాంగానే అపహాస్యం చేసి ఒకపార్టీపై గెలిచి మరొక పార్టీలోకి వెళ్లిన నీతిమాలి పనికంటే నీచమైనవారా దళితులు... ఉత్పత్తి రంగానికి చెందిన శ్రమజీవుల వల్లే తింటూ, చలువ బట్టలు కట్టుకుంటూ తిరగ గలుగుతున్నామని ఎప్పటికైనా తెలుసుకునే సంస్కారాన్ని వారి నుంచి మనం ఆశించగలమా ?

ఇంతవరకు రిజర్వుస్థానాల్లో తప్ప ఎక్కడా ఎస్సీ,ఎస్టీలకు అసెంబ్లీ స్థానాలు కల్పించని పార్టీల అధినేతలు ఆయా స్థానాల్లో ఈ అణగారిన కులాల ఓట్లతోనే గెలిచామని, తాము జవాబుదారిగా ఉండాల్సింది ప్రజలకే తప్ప అధినేతలకు కాదని ఈ మంత్రులు ఎప్పుడు తెలుసుకుంటారు ? ఒక్కరోజైనా ఒక్క దళితుడి పక్షాన్నె మాట్లాడని ఈ కుహనా ఎస్సీ, ఎస్టీ మంత్రులకు ఇప్పుడు లక్షమంది దళితులు హాజరై వారి పదవులను పదికాలాల పాటు కాపాడాలా ? ఏపార్టీలు వచ్చినా ఆటగాళ్లు మారుతున్నారు తప్ప, ఆటతీరు మారడం లేదు...ఇప్పటికైనా ఆయా వర్గాలు కళ్లు తెరచి, ప్రభుత్వం ఉన్నది ప్రజల కోసమేనని ప్రజలు ప్రజాప్రతినిధుల పాదసేవ చేయడానికి కాదని గుర్తించాలి. ఏది ఏమైనా చలిచీమలు తమ సత్తా చూపించే సమయం వచ్చింది.

# యోగా ప్రశాంతత నిస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

దీనికి ఒత్తిళ్లే కారణమన్నారు. మెదడును నియంత్రించుకోవాలంటే యోగా గొప్ప సాధనమని తెలిపారు. రోగం వస్తే డాక్టర్లు మందులు ఇవ్వగలుగుతారు కానీ.... ప్రకృతి వల్ల పొందే ఆరోగ్యాన్ని ఇవ్వలేరన్నారు. ప్రతి ఒక్కరు ఒత్తిడికి లోనయినప్పుడు 5 నిమిషాలు యోగా చేస్తే ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. సంపద ఆనందాన్ని ఇవ్వదని..., మానవ సంబంధాలు మాత్రమే ఆనందాన్ని ఇస్తాయని ఆయన వివరించారు. యోగా అనేది ఒక కులానికి,మతానికి సంబందించిన విషయం కాదని సీఎం స్పష్టం చేశారు.

**యోగాకు పబ్లిక్ షోలు అవసరం లేదు : నితీష్ యోగా**

**పాట్నా :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత్ సహా పలు దేశాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొని యోగాసనాలు వేశారు. ఇక దేశవ్యాప్తంగా పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నేతలు, ప్రముఖులు యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. అయితే బిహార్ ముఖ్యమంత్రి నితిశ్ కుమార్ మాత్రం ఎక్కడా యోగా కార్యక్రమంలో పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాట్నాలో ఓ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీ, కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమానికి బీహార్ సీఎం నితిశ్ కుమార్ రాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# 30న దళిత తేజం ముగింపు సభ

**విజయవంతం కోసం మంత్రుల విజ్ఞప్తి**


**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత తేజం ముగింపు కార్యక్రమం నెల్లూరులో జరుపనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు, మంత్రి కళావెంకట్రావు చెప్పారు. ఉండవల్లిలోని సీఎం నివాసం వద్ద ఉన్న గ్రీవెన్స్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి కళా వెంకట్రావుతో పాటుగా మంత్రులు నారాయణ, నక్కా ఆనంద్ బాబు, జవహర్‌లు మాట్లాడుతు దళిత తేజం తెలుగుదేశం ముగింపు సభను ఈ నెల 30న లక్ష మంది దళితులతో భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. జనవరి 26 నుంచి నిర్వహిస్తు వచ్చిన దళిత తేజం కార్యక్రమం ఊహించని స్థాయిలో విజయవంతం చేశామని చెప్పారు. 50,60 ఏళ్లలో ఇటువంటి సభను ఈ స్థాయిలో ఎవరు నిర్వహించలేదని అన్నారు. వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దళితులు దగా పడ్డారని విమర్శించారు. తెలుగు దేశం హయాంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో దళితుల సంక్షేమానికి బాటలు వేస్తున్నామని, 13 జిల్లా నుంచి భారీ స్థాయిలో దళితులు తరలి రానున్నారని చెప్పారు. రాజధానిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించిందని, అంబేద్కర్ ఆశయం, చంద్రబాబు ఆచరణను వివరించటమే లక్ష్యంగా దళిత తేజం సాగిందని వారు వివరించారు. ముగింపు సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, జూపూడి ప్రభాకర్ పాల్గొన్నారు.

# భూ కబ్జాలకు ప్రభుత్వం అండ

**క్షురకులను సీఎం బెదిరించడం సరికాదు**

**ట్విటర్‌లో పవన్‌కల్యాణ్**

**రావా ప్రతినిధి, అమరావతి :** రాష్ట్ర ప్రభుత్వంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ మరోసారి ట్విట్టర్ వేదికగా విమర్శలకు దిగారు. భూముల్ని రక్షించాల్సిన ప్రభుత్వమే భూకబ్జాలకు అండగా ఉంటోందని విమర్శించారు. రాజధాని భూములపైనా పవన్ స్పందించారు. అమరావతి నిర్మాణం కోసం భూసేకరణ చట్టాన్ని ప్రయోగించవద్దని ప్రభుత్వానికి సూచించారు. ఇప్పటికే సరిపడా భూముల్ని సమీకరించినందున భూసేకరణ చట్టం ప్రయోగిస్తే తాను పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయంపై అమరావతి ప్రాంతంలో రైతులతో తాను సమావేశం కానున్నట్లు తెలిపారు. ఈనెల 23న పవన్ కళ్యాణ్ విజయవాడకు రానున్నారు. ఈ నేపథ్యంలో ట్విట్టర్లో పవన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నాయీ బ్రాహ్మణుల సమస్యపైనా పవన్ స్పందించారు. నాయకుల్ని ప్రజలు ప్రేమ, అభిమానంతో ఎన్నుకుంటే వారు భయపెట్టాలని చూడటం సరికాదని అభిప్రాయపడ్డారు. క్షురకుల న్యాయమైన డిమాండ్లకు తాను మద్దతిస్తున్నానని... వాటిని పరిష్కరించేందుకు జనసేన కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.




# కృష్ణమ్మను ఒడిసి పట్టు..!

- వైకుంఠపురం బ్యారేజ్‌కు రూ.2,169
- చోడవరం వద్ద మరో బ్యారేజ్ ప్రతిపాదన
- త్వరలో టెండర్లు పిలవనున్న జలవనరులశాఖ

**రాజధాని ప్రతినిధి,అమరావతి :** అటు రాజధాని, ఇటు కృష్ణా, గుంటూరు, ప్రకాశం పశ్చిమ గోదావరి జిల్లాలకు అవసరమైన తాగు, సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే కృష్ణమ్మను ఒడిసి పట్టుకునేందుకు వీలుగా కోట్లతో ఒక బ్యారేజ్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇటీవలే ఇందుకు ప్రభుత్వం పరిపాలనాపరమైన ఆమోదాన్ని తెలిపింది. వైకుంఠపురం వద్ద 10 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. అలాగే ప్రాకాశం బ్యారేజ్‌కు దిగువన విజయవాడ సమీపంలోని పెనమలూరు మండలం చోడవల్ల వద్ద మరో భ్యారేజ్ నిర్మాణానికి జలవనరులశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్ మాత్రమే రేండు జిల్లాలకు తాగు, సాగునీటి సరఫరాకు ఉపయోగపడుతోంది. ఈ నేపథ్యంలో ఎగువ నుంచి వచ్చే వరద నీటిని నిల్వ చేసేందుకు అవకాశం లేకపోవటంతో బ్యారేజ్ గేట్లను ఎత్తి నీటిని సముద్రంలోకి విడుదల చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల క్రితమే రెండు బ్యారేజ్‌ల నిర్మాణానికి జలవనరులశాఖ ప్రతిపాదించగా, ఇన్నాళ్లకు ఒక్కదానికి మోక్షం లభించింది. అదే స్ఫూర్తితో చోడవరం బ్యారేజ్ అనుమతి కోసం మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎగువ నుంచి వరదలు వచ్చినపుడు ప్రకాశం బ్యారేజ్‌లో మూడు టీఎంసీలు, చోడవరం వద్ద కూడా వీలైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలని నిపుణులు యోచిస్తున్నారు. రాజధాని అమరావతి జనాభా సుమారు ఐదు లక్షలకు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజధానిలో ఇప్పటికే సచివాలయం, శాసనసభ, శాసన మండలి భవన నిర్మాణాలు జరుగుతుండగా,ఐపీఎస్, ఐపీఎస్‌ల క్వార్టర్లు, ఇతర బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇంకా సీఎం, హైకోర్టు, గవర్నర్ నివాస బంగాళాల డిజైన్‌లు పలు దశల్లో ఉన్నాయి.

**సాగర్ నుంచి వస్తేనే పులిచింతలలో నీళ్లు**

కృష్ణాడెల్టాలోని 13.7 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేదుకు పులిచింతల వద్ద డాక్టర్ కేఎల్ రావు సారగ్ పులిచింతల ప్రాజెక్టును నిర్మించారు. వాస్తవానికి అక్కడ 45.77 టీఎంసీల నీటి నిల్వ సామర్థం ఉన్నా, పది టీఎంసీలకు నిల్వ చేయలేని పరిస్థితి ఉంది. దీనికితోడు నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదుల చేస్తే తప్ప పులిచంతలకు నీళ్లు రావు. మరోవైపు ఎక్కువ నీటిని నిల్వ చేస్తే తెలంగాణా నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం వైకుంఠపురం భ్యారేజ్‌ని ప్రతిపాదించింది. ఖమ్మం జిల్లాలోని మునేరు, వైరా, కట్టలేరు నుంచి వచ్చే వరద నీటిని వైకుంఠపురం వద్ద నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. పులిచింతల నుంచి నీళ్లు రాకున్నా వైకుంఠపురం నీటితో అటు సాగు, ఇటు తాగునీటిని అందించే అవకాశం ఉంటుందని జలవననరులశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ బ్యారేజ్ నిర్మాణానికి నిధులు ఓకే కావటంతో, టెండర్లు పిలిచేందుకు ఆ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తూన్నారు.

# పిల్లల దేవత ఈ పోలీస్ ఆఫీసర్

ఆమె





ప్రభుత్వోగులు చాలా వరకు యాంత్రికంగా విధులు నిర్వహిస్తుంటారు. వచ్చామా.. చేశామా .. వెళ్లామా అన్నట్టే ఉంటుంది. అయితే కొంతమంది హృదయపూర్వకంగా ప్రజసేవ జరిపేవారు ఉంటారు.. వారిలో ఒకరు రేఖా మిశ్రా..

రేఖా మిశ్రా (32) కేంద్ర రైల్వే రక్షణదళం (ఆర్పీఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. కేవలం రైల్వేలకే కాకుండా ఇంటి నుంచి పారిపోయి వచ్చిన పిల్లలు, మహిళలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడంలో కొన్నేళ్లుగా ఆమె అమోఘ పాత్ర పోషిస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన రైల్వే జనరల్ మేనేజర్ ఆమెకు అభినందన సభ ఏర్పాటు చేశారు. అంతేకాదు మహారాష్ట్ర ప్రభుత్వం ఆమె కర్తవ్యనిర్వహణను ఎస్ఎస్‌సీ పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా చేర్చింది. తప్పిపోయిన, అనాధలు, సర్వం కోల్పోయిన వారు, అపహరణకు గురైన వందలాది మందిని అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి ఎన్నో రైల్వే స్టేషన్ల నుంచి ఆమె కాపాడారు. ఆమె సాహస కృత్యాలన్నీ మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్చి,కూర్చి ఈ ఏడాది పాఠ్యాంశంగా రూపొందించింది.

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌కు చెందిన మిలటరీ అధికారి కుమార్తె రేఖా మిశ్రా 2014లో రైల్వే రక్షణ దళంలో ప్రవేశించారు. ప్రస్తుతం ఆమె ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినల్ (సీఎస్ఎంటీ) లో విధుల నిర్వహిస్తున్నారు. కేంద్ర రైల్వే జనరల్ మేనేజర్ డీకే శర్మ ఆమె సాధించిన విజయాలకు సన్మానం చేశారు. దీంతో ఆమె సాహస కృత్యాలు, సేవలు వెలుగులోకి వచ్చాయి. అసమాన ధైర్యసాహసాలతో విధులు నిర్వహించడమే కాకుండా, దీనులు, దరిద్రులకు ఆమె నిర్వర్తించిన బాధ్యతలు రాబోయే తరానికి తప్పకుండా మార్గదర్శకత్వం చేస్తాయని శర్మ ఆమెను శ్లాఘించారు.

తాగుబోతు తండ్రుల నుంచి, సోదరీసోదరులతో గొడవలు పడి, లేదంటే వారి అభిమాన హీరోలను చూడటానికి, వారి ఫేస్‌బుక్ ఫ్రెండ్స్‌ను కలవడానికి, ఆర్థిక రాజధాని ముంబై అందాలను తిలకించడానికి ఇంట్లో చెప్పకుండా వస్తారని, కొంతమంది కిడ్నాపుకు గురైన పిల్లలు కూడా ఉంటారన్నారు. ఇలాంటి వారిని రక్షించడానికి ఆమె కొన్ని బృందాలను ఏర్పాటు చేశారు. 13 నుంచి 16 ఏళ్ల పిల్లలు పడకూడని చేతుల్లో పడి జీవితాలను నష్టపోతుంటారని, అయితే అలాంటి బాధాకరమైన పరిస్థితుల నుంచి తప్పించి మళ్లీ తమ కుటుంబాలతో కలపడమే లక్ష్యమని రేఖా మిశ్రా వెల్లడించారు. విధుల్లో నియమితులైన నాలుగేళ్లలో ఇప్పటివరకు 430 మందిని అమాయక పిల్లలను కాపాడామని, వారిలో 45 మంది మైనర్లు కాగ, ఒక మూగ బాలుడు, చాలా మంది దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి హిందీలో మాట్లాడలేని వారు ఉంటారన్నారు. వీరితో మాట్లాడటానికి దుబాసీలను ఉపయోగించుకుంటామన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్, భారత్‌లోని ఇతర రాష్ట్రాల్లోని వారు వస్తుంటారన్నారు. వేసవి సెలవుల్లో ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చే పిల్లల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. ఇలా పారిపోయి వచ్చిన వారి ఇంటి అడ్రసు తెలుసుకొని మళ్లీ కుటుంబ సభ్యులతో కలసి ఉండేలా ఇంటికి చేర్చుతామన్నారు. అయితే వారిని ఇంటికి చేర్చడం అంత తేలిక కాదని, చాలా మంది పిల్లలు ఇంటికి వెళ్లడానికి అసలు ఇష్టపడరని,అందువల్ల వారి తల్లిదండ్రుల పేర్లు, అడ్రస్ చెప్పరన్నారు. వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం సవాలుతో కూడుకుందన్నారు. ఎంతో దూరం నుంచి వచ్చే పిల్లలు పూర్తిగా అలసిపోయి,ఆకలితో నకనక లాడుతూ ఉంటారని, ఎవరిని నమ్మాలో ...ఎవరిని నమ్మకూడదోనని వారిలో చాలా భయం ఉంటుందన్నారు. గస్తీ సమయంలో భయంగా, ఆకలిగాఉంటూ, ఏడుస్తూ ఉండే పిల్లలు ఎవరైనా కనబడితే వారిని వివరాలు అడుగుతామన్నారు. వంటరిగా కనబడిన పిల్లలను గుర్తించమని తన బృందాలనికి తెలిపానని సబ్ ఇన్‌స్పెక్టర్ సుహాస్, శివరామ్ సింగ్, ప్రవీణ్ మహాజన్‌లు తనను అర్థం చేసుకొని చాలా సహకరిస్తారన్నారు. ఒక్కోసారి పోలీస్ స్టేషన్‌లో పిల్లలు చాలా భయపడుతుంటారని అందువల్ల వారికోసం ఉండిపోవాల్సి వస్తుందన్నారు. రోజుకు 12 గంటలు విధుల్లో ఉండే ఆమె గురించి పాఠ్యాంశాలు రూపొందించడంలో అతిశయోశక్తి లేదు.

## జర్నలిస్టుల గృహ నిర్మాణానికి రూ.100 కోట్లు

**మంత్రి కాల్వ శ్రీనివాసులు**

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టుల గృహ నిర్మాణ పథకానికి రాయితీగా రూ.100 కోట్లను విడుదల చేసినట్లు సమాచార పౌర సంబంధాలు గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ పథకానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసిందన్నారు. జర్నలిస్టుల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇందుకు అవసరమైన నిధులను అదనంగా మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల లబ్దిదారులకు అందిచే రాయితీలకు అదనంగా జర్నలిస్టుల గృహ నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1 లక్ష, పట్టణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల రాయితీగా మంజూరు చేసేందుకు ఈ నిధులను వినియోగిస్తామన్నారు. ఈ మేరకు వంద కోట్ల అదనపు బడ్జెట్‌ను మంజూరు చేస్తూ ఆర్థికశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. జర్నలిస్టుల గృహ నిర్మాణ పథకం మార్గదర్శకాలు త్వరలోనే విడుదల చేస్తామి కాల్వ పేర్కొన్నారు.

**జర్నలిస్టులకు శిక్షణ తరగతులు**

రాష్ట్రంలోని జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల శిక్షణ తరగతులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. రెండు జిల్లాల జర్నలిస్టులకు కలిపి ఒకే చోట శిక్షణ ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని సమాచారశాఖ ఉన్నతాధికారులను మంత్రి అదేశించారు. అనంతపురం జిల్లా నుండి ఈశిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టాలన్నారు. సమాచార శాఖపై మంత్రి సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచారశాఖ కమిషనర్ ఎస్ వెంకటేశ్వర్, ఇతర అధికారులతో సమీక్షించారు. సమాచారశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్లేందుకు సమాచారశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వ పథకాల పరిశీలనకు తీసుకొని వెళ్లేందుకు క్షేత్రస్థాయి అధికారులకు అదనపు బడ్జెట్‌ను సమకూర్చాలని మంత్రి అదేశించారు.

## కాలమ్

### నీ రాకతో...??

తుగ్లక్ పాలన ఎలా ఉంటదో తెలియని మాకు రుచి చూపించావు..
పాత సామాన్లు, బట్టలు మార్చినంత తేలికగా డబ్బు **నోట్లు** మార్చేయచ్చు అని చూపించావు..
**నల్ల ధనం** మన దేశానికి ఈ జన్మలో తిరిగి రాదు అని క్లారిటీ ఇచ్చేసావు..
మా డబ్బు మేము **బ్యాంకు** లో వేసినా తప్పు..
డబ్బు ని బ్యాంకులో **వేయక పోయినా** తప్పు..
**బంగారం** కొనాలంటే భయం..
ట్యాక్స్ తగ్గించుకుందాం అని **ముదుపు** చేసినా తప్పే..
మ్యూచువల్ ఫండ్ అయినా, ఫిక్సిడ్ డిపాజిట్ అయినా, నా బొంద అయినా ఆఖరికి మనిషి చచ్చినా నీకు ట్యాక్స్ కట్టాలి..
ఇన్-కమ్ ట్యాక్స్ లో తగ్గించుకున్న డబ్బుకి 10 రెట్లు ప్రభుత్వ ట్యాక్స్ తో లాగుతున్నావు
ఇక **నిత్యావసర ధరలు**, వాటి మీద మేము కట్టే జి.యస్.టి గురించి అయితే పెట్రోల్ ధరలను స్టాక్ మార్కెట్ కు పోటీగా పరుగులు పెట్టిస్తున్నావు..
అలా అని చక్కగా పరుగులు పెడుతున్న స్టాక్ మార్కెట్ ను వదిలావా..?? లేదుగా, నీ చల్లని చూపుతో **విజయవంతంగా** నాశనం చేసావు.
నీకంటే భార్య, బిడ్డలు, ఇల్లు, సేవింగ్స్, లాంటి బాధ్యతలు లేవు.. మమ్మల్ని కూడా నీలాగ మార్చేయాలని కంకణం కట్టుకున్నావా ఏంటి..
కాంగ్రెస్ వాళ్ళు మధ్య తరగతి వాళ్ళని **ఒక చెంప** పగిలేలా కొడితే, నువ్వు మరీ అరాచకంగా **మా చెంపలు, వీపులు** పగిలేలా కొడుతున్నావు..
నాయనా.. నీకో దణ్ణం బాబు.. **అచ్చే దిన్** మాట ఏమోగానీ, నీ దెబ్బకి పిచ్చే దిల్ అవుతుంది.. మా బతుకులు మమ్మల్ని ఏదో అలా అలా బ్రతకనీ..
– నువ్వు ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఇంకేం లాక్కుంటావో మా దగ్గర నుంచి అని భయపడుతూ, బిక్కు బిక్కుమని కాలం గడుపుతున్నారు.




## రాజధాని క్లాసిఫైడ్స్

### నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: 9440662699

### ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

వెంకటపాలెం
సాయిలాస్య రియల్ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 951515393

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రేడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
చంద్రిక ట్రేడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

**రాయపూడి**
రియల్ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 9848442436

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

### షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

### హాస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : 9440421580

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మెహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్.టి
డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

### వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

### విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2370444

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2343000


గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 9493170689

## కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి

- సంప్రదాయాల మేళవింపుతో డిజైన్లు
- ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రభుత్వం



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** అమరావతి రాజధానికి తలమానికంగా నిలిచే ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి చేరువగా వచ్చింది. రెండేళ్ల చర్చలు ఎట్టకేలకు కార్యరూపం దాల్చబోతున్నాయి. విజయవాడలోని ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న పవిత్ర సంగమం నుంచి అమరావతిలోని ఎన్ 10 రహదారిని అనుసంధానిస్తు అద్భుతమైన ఐకానిక్ బ్రిడ్జి రాజధాని వాసులకు అందుబాటులోకి రానుంది. రూ.1387 కోట్ల ఖర్చుతో నిర్మితం కానున్న ఈ బ్రిడ్జి కి టెండర్లు ఆహ్వానించగా పలు ప్రముఖ సంస్థలు పోటీ పడ్డాయి. వాటిలో ఎల్ అండ్ టీ, ఎస్ పీ సింగ్లా, గామన్ సంస్థల మధ్య పోటీ నెలకొనగా ఎల్ అండ్ టీ టెండర్ల దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ వంతెనను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కాగా ముందుగా టెండర్లు పిలిచి రద్దు చేశారు. అనంతరం మరోసారి టెండర్లు పిలవగా ఎల్ అండ్ టీ అవకాశం అందిపుచ్చుకుంది. బ్రిడ్జికి సంబంధించిన ఆకృతులన్ని టెండర్ పొందిన సంస్థ సిద్ధం చేయాల్సి ఉంది. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిభింబించేలా ఈ డిజైన్లు రూపొందించాల్సి ఉంది. ఇప్పటికే కొండపల్లి బొమ్మ, కూచిపూడి నాట్య భంగిమ, యోగముద్ర వంటి పలు రకాల ఆకృతులను సిద్ధం చేశారు. అయితే టెండర్ పొందిన సంస్థ మళ్ళీ డిజైన్లు రెడీ చేయాలని నిబంధన విధించి, రెండు నెలల గడువు ఇచ్చారు. 3.2 కిలోమీటర్ల పొడవైన వంతెన మధ్యలో 480 మీటర్ల భాగం తీగలతో ఉండేలా నిర్మాణం కానున్నట్లు తెలుస్తుంది. వంతెన మధ్యలో ఏర్పాటు చేసే పైలాన్ నుంచి బలమైన ఇనుప తీగలు కడుతారని అక్కడ వంతెన కింద నిర్మించే పిల్లర్ల దూరం ఎక్కువగా ఉంటుందని దీనితో ఈ ఇనుప తీగల పైనే ఇది ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది. అయితే బ్రిడ్జికి అవసరమైన ఇనుప తీగలు స్విట్జర్లాండ్, అమెరికాల్లో మాత్రమే తయారు చేస్తారని ఏడీసీ అధికారులు తెలిపారు. కృష్ణానదిలో ఎప్పుడు నీటి మట్టం నిల్వ ఉంచే పరిస్థితులలో వంతెన నిర్మించడం కొంచెం సంక్లిష్టమైన ప్రక్రియని, భారీ పరికరాలు అవసరమవుతాయని అధికారులు తెలియ చేస్తున్నారు. ఇదే సమయంలో ఇనుప తీగలు విదేశాలలో తయారు చేయించాలంటే కోట్ల రూపాయలలో ఖర్చవుతుందని చెప్పారు. అనేక ఇబ్బందుల నడుమ ఐకానిక్ వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. అనుకున్న సమయానికి నిర్మాణం పూర్తి చేసుకుంటే రాజధానికి ఎంతో ఆకర్షణీయమైన వంతెన వచ్చినట్లే. అటు పర్యాటక పరంగా ఎంతో అభివృద్ధి అందుకునే అవకాశం సైతం ఉండటంతో ప్రభుత్వం దీని నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైతే కృష్ణానదిపై సరికొత్త అందాలు తిలకించే అవకాశం దక్కుతుంది. డిజైన్లు పూర్తి చేసి బ్రిడ్జి నిర్మాణానికి వేగంగా వెళ్లాలనే సంకల్పంలో టెండర్ దక్కించుకున్న సంస్థ ఉంది.

## తొలి దశలో 50 అన్న క్యాంటీన్లు

**ఏటా రూ.131 కోట్ల ఖర్చు - బయోమెట్రిక్ విధానంలో టోకెన్లు**



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** పట్టణాల్లో పేదల ఆకలిని తీర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్లకు ప్రభుత్వం శ్రీకారం చూడుతోంది. తొలి దశలో 50 క్యాంటీన్‌లను రెండు మూడు రోజుల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాన్ని రూ.15కే అందించేందుకు ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయనుంది. ఈ క్యాంటీన్‌లను అత్యంత ఆకర్షణీయమైన ఆకృతులలో, ప్రభుత్వ పథకాలను తెలియజేసేలా ఏర్పాటు చేయనున్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీఆర్, సీఎం చంద్రబాబు ఫోటోలతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ క్యాంటీన్‌ల నిర్వహణ ఏటా రూ.131 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఒక్కొ క్యాంటీన్‌ను రూ.36 లక్షలతో నిర్మిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక తరహాలోనే అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసి రూ.5కే భోజన సౌకర్యం కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే ఈ తరహా క్యాంటీన్ వెలగపూడిలోనే సచివాలయంలో విజయవంతంగా అమలవుతోంది. వీటి నిర్మాణాలను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు అన్న క్యాంటీన్‌ల నిర్మాణ వివరాలను తెలుసుకుంటున్నారు. ఇదిలావుండగా, క్యాంటీన్‌ల టోకెన్లను బయోమెట్రిక్ విధానంల జారీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. క్యాంటీన్‌లలో తాగునీటితోపాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించనున్నారు. సీసీ కెమేరాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటి నిర్వహణపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నట్లు ఒక అధికారి చెప్పారు. అన్న క్యాంటీన్‌లలో భోజనం తయారీ, పంపిణీ టెండర్‌ను ఇప్పటికే అక్షయ పాత్ర దక్కించుకుంది.

## కొట్టేద్దాం... లండన్ చెక్కేద్దాం...

- ➡ అందరి దారి బ్రిటన్‌వైపే
- ➡ లలిత్‌మోడీ, నీరవ్ మోడీ
- ➡ విజయ మాల్యా సహా 5,500కి ఆశ్రయం
- ➡ అప్పగించాలంటే కోర్టు అనుమతించాల్సిందే



**రాజధాని ప్రతినిధి, డెస్క్ :** భారత్‌లో పలు ఆర్థిక కుంభకోణాలకు పాల్పడిన వారికి బ్రిటన్ (యూకే) ఆశ్రయం కల్పిస్తోంది. ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోడీ, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధినేత విజయ్ మాల్యాతోపాటు తాజాగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మోసగించిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ సైతం బ్రిటన్‌లోనే తలదాచుకుంటున్నట్లు స్పష్టమైంది. అసలు వీరంతా అక్కడే ఎందుకు ఆశ్రయం పొందుతున్నారనేది చాలా మందికి తెలియదు. భారత్‌లో పలు మోసాలకు పాల్పడి బ్రిటన్‌లో ఆశ్రయం పొందుతున్న వారి సంఖ్య సుమారు 5,500 వరకు ఉంటుందని అంచనా. వీరిలో అందరూ నేరస్తులు కాదు. దేశంలో ముప్పు ఉందని భావించే వారికి బ్రిటన్ సురక్షిత ప్రాంతంగా ఉంటోంది. దీంతో ఎవరికి వారు బ్రిటన్ వెళ్లిపోతున్నట్లు సమాచారం. అసలు వీరంతా అక్కడే ఎందుకు ఆశ్రయం పొందుతున్నారని ఆరా తీయగా, ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. బ్రిటన్‌లో మానవ హక్కుల చట్టాలను పటిష్టంగా ఆ దేశం అమలు చేస్తుంది. శరణు కోరి వచ్చిన ఎవరినైనా సరే ఆయా దేశాలకు అప్పగించాలంటే అక్కడి కోర్టులు ఎక్కువ సమయాన్నే తీసుకుంటాయట. ఆతతంగం మొత్తం ముగిసే సరికి తల ప్రాణం తోకకి రావటం ఖాయం. తమ దేశంలో తలదాచుకుంటున్న వారికి తిరిగి అప్పగిస్తే వారిని హింసిస్తారేమో, వారికి మరణ శిక్షను అమలు చేస్తారేమోనని కోర్టు అనుమానిస్తాయి. లేకపోతే రాజకీయ కారణాలతో వారిని అప్పగించాలని కోరుతున్నాయా అని కూడా భావిస్తాయట. దీంతో వారిని స్వదేశాలకు అప్పగించకుండా ఉండేందుకు కోర్టులు ఆలస్యం చేస్తాయట. కొన్ని సందర్భాల్లో వ్యక్తులను అప్పగించేందుకు నిరాకరిస్తాయట. దీంతో ప్రతి ఒక్కరూ ఎంచక్కా బ్రిటన్ వెళ్లిపోయి ఎంచక్కా తలదాచుకుంటున్నారు మరి.

**తొమ్మిది మంది అప్పగింత పెండింగ్‌లోనే**

కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యా సహా ఇప్పటి వరకు తొమ్మిది మందిని తమకు అప్పగించాల్సిందిగా భారత ప్రభుత్వం బ్రిటన్‌ని కోరింది. 2011లో ఫోర్జరీతో మోసానికి పాల్పడ్డ రాజేష్ కపూర్‌ను, ఉగ్రవాదంతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణతో 2004లో టైగర్ హనీఫ్‌ను, లైంగిక నేరాలకు పాల్పడ్డ ఆరోపణలతో 2012లో అతుల్ సింగ్‌ను, ఫోర్జరీ కేసులో 2009లో రాజ్‌కుమార్ పటేట్‌ను, బ్యాంకు మోసాలకు పాల్పడ్డారని 2014లో జితేందర్ అంగురాలా, ఆశారాని అంగురాలాను, క్రికెట్ బెట్టింగుల నేపథ్యంలో 2004లో సంజీవ్ కుమార్ చావ్లాను, కుట్ర, దొంగతనం ఆరోపణలతో 2004లో షేక్ సాదిక్‌ను తమకు అప్పగించాల్సిందిగా భారత్ బ్రిటన్‌ను కోరింది. ఈ అభ్యర్థనలన్నీ అక్కడే కోర్టుల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. 1992లో భారత్ - బ్రిటన్ ఆయా దేశాల నేరస్తుల అప్పగింతల ఒప్పందంపై సంతకం చేసిన నాటినుంచి కేవలం ఒక్కరంటే ఒక్క భారతీయుడినే బ్రిటన్ భారత్‌కు అప్పగించింది. 2016 బ్రిటన్ భారతకు అప్పగించిన సమీర్‌భాయ్ వినుభాయ్ పటేలే ఆ ఒకే ఒక్కడు. ఇదిలావుండగా, హత్య కేసులో 2007లో మనిందర్ పాల్ సింగ్ కోహ్లీ, 2009లో చీటింగ్ కేసులో సోమయ్య కేతన్ సురేంద్ర, 2013 లో కిడ్నాప్ కేసులో కుల్వీందర్ సింగ్ ఉప్పల్ బ్రిటన్ నుంచి పారిపోయి భారత్‌లో తలదాచుకున్న వారిని బ్రిటన్‌కు అప్పగించింది. వివిధ నేపథ్యాల్లో భారత్ చేసిన చాలా అప్పగింత అభ్యర్థనలను బ్రిటన్ తిరస్కరించింది. రేమండ్ వార్లే, రవిశంకరన్, వేలు భూపాలన్, అజయ్ ప్రసాద్ ఖైతాన్, వీరేంద్ర కుమార్ రస్తోజీ. ఆనంద్ కుమార్ జైన్లు ఈ కోవకు చెందిన వారే. ఇంత పదిలంగా ఉండబట్టే తాము పట్టుబడతామనే పొగ వాసన తగలగానే రెక్కలు కట్టుకొని బ్రిటన్‌లో వాలిపోతున్నారు.



# అంతటా తానై...

దేశవ్యాప్తంగా మైనార్టీలో అధిక సంఖ్య ముస్లింలదే. మన రాష్ట్రానికి వస్తే కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, గుంటూరు , కృష్ణాజిల్లాల్లో వారి జనాభా అధికంగానే ఉంది. కాంగ్రెస్, అంతకు ముందు తెలుగుదేశం ప్రభుత్వాల్లో ఖచ్చితంగా ముస్లింలకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉండేది. అయితే 2014లో తెలుగుదేశం ప్రభుత్వం వారిని నిర్లక్ష్యం చేసింది. బీజేపీతో అనుబంధం వల్ల ఈ పనిచేసిందని భావించినా, అపై బీజేపీకి దూరంగా జరిగినా ముస్లింలకు కూడా దూరంగానే ఉంటూ వచ్చింది. తెలుగుదేశం తరపున ఎన్నికైన ఎమ్మెల్సీలే కాకుండా, వైసీపీ నుంచి అధికార పక్షంలోకి జంప్‌చేసిన కదిరి ఎమ్మెల్యే చాంద్ బాషా, విజయవాడ జలీల్‌ఖాన్‌లను మంత్రి పదవులు ఇస్తామని ఆశ చూపికూడా మొహం చాటేసి ఈనాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి ముస్లింలకు దూరంగా ఉన్నారనేది వాస్తవం.

హిందువుల్లా రోడ్లకూడలిలో రాయికి పసుపు,కుంకుమలు రాసి రాత్రికి రాత్రే పోచమ్మ,మైసమ్మ, అంకాలమ్మ లాంటి దేవతలు వచ్చారని గాని లేదంటే చిన్న పాక వేసి భక్తిగీతాలు పాడుకుంటూ క్రిస్టియన్లలా బోధ ప్రారంభించడం కాని ముస్లింలు చేయరు.వారు ఎప్పటి నుంచో వస్తున్న పాత మస్‌జిత్‌ల్లోనే నమాజు చేసుకుంటారు. అలాంటి పరిస్థితుల్లో కృష్ణాబ్యారేజ్ ఎదురుగా ఉన్న మస్‌జిద్‌ను దాదాపుగా కూల్చివేసి కేవలం మస్‌జీద్‌లోని అతి పవిత్ర స్థలాన్ని మాత్రమే ఉంచారు. ఇదే సమయంలో రామవర్పాడు లోని మసీదును కూడా పూర్తిగా కూల్చివేసారు.దీనిపై ముస్లింలంతా అనేక మార్లు ఉన్నతాధికారులను కలసి వినతి పత్రాలను సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇదే సమయంలో 2015లో రంజాన్ సందర్భంగా నన్నెవరూ కలసి శుభాకాంక్షలు చెప్పలేదని చంద్రబాబు వాపోయినట్టు కూడా వార్తలు వచ్చాయి. ఇక ప్రతి ఏడాది రంజాన్ తోఫా అంటూ రంజాన్ మాసంలో తెల్లకార్డు ముస్లింలకు ఇచ్చే సరుకుల సంచిపై చంద్రబాబు ముస్లిం టోపీలతో దర్శనమిస్తారు. సీఎం, మంత్రి ప్రత్తిపాటి, (ఈ ఏడాది లోకేష్) లు టోపీ పెట్టుకుని నమాజు చేస్తున్న ఫోజులతో హోర్డింగులతో పట్టణాలను,పల్లెలను నింపడం పరిపాటిగా మారింది. అంతేకాని మాకు ఒక మంత్రి ఉన్నాడనిపించుకుంటానికైనా ముస్లింలకు ఒక మంత్రి పదవి ఇవ్వకపోవడం దారుణం.

ఇదేసమయంలో పండుగను నిర్వహించుకోవడానికి ముస్లింలకు ఈద్గా లేకపోవడంతో పెద్దలంతా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈద్గా నమాజ్‌లు చేయాలని నిర్ణయించుకున్నారు. దీనిలో కొందరు ఈ ప్రార్థనలకు చంద్రబాబును ఆహ్వానించారు. భక్తిప్రపత్తులతో జరుపుకునే ఈ నమాజ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యకర్తలు ఏమిటంటూ సాంప్రదాయవాదులు ఆహ్వానించిన వారిని మందలించి నట్లుగా కూడా తెలిసింది. అయితే ఆయన ఆహ్వానాన్ని మన్నించగానే కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయడం మంత్రుల భద్రతరీత్యా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం వెనువెంటనే జరిగి పోయాయి. ఇది భక్తులకు ఇబ్బంది కలిగించిన మాట వాస్తవం. అదే సమయంలో ఒక వ్యక్తి లేచి రామవరప్పాడులోని కూల్చివేసిన మసీదు స్థానంలో మరొకటి నిర్మించడంపై నిలదీయడం, సీఎం త్వరలో కట్టిస్తామని హామీ ఇవ్వడం అంతకు ముందుకూడా ఇలాగే అన్నారు..ఎప్పుడు కట్టిస్తారో చెప్పండి అని సూటిగా మాట్లాడటంతో పక్కనే ఉన్న కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించడం జరిగింది. ముస్లింలకు అన్నీ తానై నిర్వహించడం ఆనందం కలిగించినా, కేవలం పథకాలు మాత్రమేకాదు, ప్రాతినిద్యం కూడా కల్పిస్తేనే ప్రజాస్వామ్యాన్ని గౌరవించినట్లవుతుందని చంద్రబాబు గుర్తించాలి.

– ఖాన్


# పెట్రోల్,డీజిల్‌పై జీఎస్‌టీ వ్యాట్

- ప్రజాగ్రహం, వామపక్ష పార్టీల డిమాండ్లతో కేంద్రం కొత్త ఆలోచన
- ఇదీ ప్రస్తుత ధరలకు సమానంగా ఉండే అవకాశం

**న్యూఢిల్లీ :** దేశ ప్రజలను పెట్రో ఉత్పత్తుల ధరలు మంటెత్తిస్తుండటంతో వామపక్షాలతోపాటు, ఇతర ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఇప్పటికే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. తక్షణమే పెట్రోల్, డీజిల్‌లపై పెంచిన ధనలను తగ్గించాలని డిమాండు చేశాయి. దీంతో కేంద్రం దిగివచ్చి పైస్తా.. పైసా అంటూధర తగ్గించినట్లుగా చూపించింది. అయితే ప్రజలు విపక్షాల నుంచి మరింత ఒత్తిడి పెరగడంతో పెట్రోల్, డీజిల్ ఉత్పత్తులను వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ)లో పరిధిలోకిచేర్చే ప్రణాళిక చేస్తోంది అయితే జీఎస్‌టీ గరిష్ట పన్ను రేటు 28 శాతంతోపాటు రాష్ట్రాల స్థానిక అమ్మకపు పన్ను లేదా విలువ ఆధారిత పన్ను(వ్యాట్)ను విధించే అవకాశాలున్నాయని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అలా చేసినా గరిష్ట జీఎస్‌టీ రేటుతోపాటు వ్యాట్ కలిసి ప్రస్తుత పన్నుత సమానంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రపంచంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్‌పై పూర్తిస్థాయి జీఎస్‌టీ లేదని, అందుకే భారత్‌లోనూ జీఎస్‌టీతో పాటు వ్యాట్ కూడా ఉంటుంది' అని ఆ ఉన్నతాధికారి తెలిపారు. కేంద్రం, రాష్ట్రాలు సంయుక్తంగా నిర్ణయం తీసుకుంటేనే పెట్రోల్ ఉత్పత్తులను జీఎస్‌టీ కిందకు చేర్చబడతాయనారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం లీటర్ పెట్రోల్‌పై రూ.19.48, లీటర్ డీజిల్‌పై రూ. 15.33 ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తోంది. దీంతో పాటు రాష్ట్రాలు వ్యాట్‌ను కూడా విధిస్తున్నాయి. పెట్రోల్‌పై ఈ వ్యాట్ ముంబయిలో అత్యదికంగా 39.12 శాతం, అండమాన్ అండ్ నికోబార్‌లో అత్యల్పంగా 6 శాతం ఉంది. ఇక డీజిల్‌పై తెలంగాణలో అత్యధికంగా 26 శాతంగా ఉంది. ఢిల్లీలో పెట్రోల్‌పై వ్యాట్ 27 శాతం డీజిల్‌పై 17.24 శాతంగా ఉంది. మొత్తం పన్నులు కలిపి పెట్రోల్‌పై 45 నుంచి 50 శాతం, డీజీల్‌పై 35 నుంచి 40 శాతం ఉన్నాయి. జీఎస్‌టీలోకి చేర్చితే కూడా దాదాపు ఇదేస్థాయిలో పన్నులు ఉంటాయని అధికారి పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్‌కి సంబంధించి ఇప్పటికే ప్రస్తుత పన్నుత పన్నులు గరిష్ట రేటుకు మించి ఉన్నాయి. పెట్రోలు, డీజిల్,ఇతర పెట్రో ఉత్పత్తులపై 28 శాతం జీఎస్‌టీ విధిస్తే, కేంద్ర ప్రభుత్వానికి రావలసిన ఆదాయం రూ.20 వేల కోట్ల వరకు తగ్గుతుంది. మరోవైపు రాష్ట్రాలు కూడా ఆదాయ నష్టాన్ని ఎదుర్కొనక తప్పదు. దీంతో ఈ పన్నులన్నీ కలిపి ప్రస్తుతం ఉన్న పన్నుల కాన్నామించకుండా జాగ్రత్తపడాలనుకుంటోంది. మే 29న పెట్రోల్ లీటరు రూ.78.43, డీజిల్ రూ.69.31 గరిష్ట ధరకు చేరుకున్నాయి. ఇదిలాఉండగా చమురు ధరలు పెరిగితే రాష్ట్రాల వ్యాట్ ద్వారా అధిక ఆదాయాన్ని సంపాదిస్తాయంటూ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బ్లాగ్ పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం 2014, నవంబరు, 2016, జనవరి మధ్య కాలంలో తొమ్మిది దఫాలుగా ఎక్సైజ్ పన్నును పెట్రోల్‌పై లీటరుకు రూ.11.77, డీజిల్‌పై రూ. 13.47కు పెంచింది. గత నాలుగేళ్లలో పెట్రో ఉత్పత్తుల నుంచి ఎక్సైజ్ పన్ను వసూలు రెండింతలు పెరిగింది. 2014–15లో రూ.99,184 కోట్ల నుంచి 2017–18లో 2,29,019 కోట్లకు పెరిగింది. ఇక రాష్ట్రాల వ్యాట్ ఆదాయం 2014–15లో రూ.137,157 కోట్ల నుంచి2017–18లో రూ.184,091 కోట్లకు పెరిగింది.




## ప్రభాస్ వ్యవసాయం చేస్తాడట...



డార్లింగ్ ప్రభాస్ పైకి కనిపించడు కానీ భలే మాటకారి. చిన్న చిన్న మాటలతో పజిల్స్ తరహాలో సమాధానాలు ఇస్తుంటాడు. తాజాగా ఒక ప్రముఖ బాలీవుడ్ వెబ్ పోర్టల్ అడిగిన కొన్ని ప్రశ్నలకు తెలివిగా ఆన్సర్స్ ఇచ్చి వాళ్ళను కన్ఫ్యూజన్ లో పడేసాడు. సాహో తర్వాత ఏ సినిమా చేయబోతున్నారు అన్న ప్రశ్నకు ఏమో అది పూర్తయ్యాక నేను ఏదైనా వ్యాపారం లేదా ఇష్టమైన వ్యవసాయం చేస్తానేమో అని చెప్పడం బాగా పేలింది. షూటింగ్ లో జరుగుతున్న విపరీతమైన జాప్యానికి కౌంటర్ వేయడానికి ప్రభాస్ సినిమాల కన్నా వ్యవసాయం బెటర్ అన్నాడా లేక అడిగిన వాళ్ళను ఉడికించడానికా మాత్రం అర్థం కాలేదు. మొత్తానికి ప్రభాస్ మనసులో రైతు అవతారం ఎత్తాలని ఉందని మాత్రం అర్థమైపోయింది. నిజ జీవితంలో సాధ్యమా కాదా అనేది పక్కన పెడితే అదేదో సినిమాలో చేస్తే మాత్రం భలేగా ఉంటుంది అనుకుంటున్నారు ఫాన్స్.


సాహో విశేషాల గురించి చెబుతూ శ్రద్ధ కపూర్ చాలా సులభంగా తెలుగు డైలాగులు చెబుతోందని తనకే హిందీ పలకడం కష్టంగా అనిపించి ఇబ్బంది పడుతున్నానని ఒప్పేసుకున్నాడు ప్రభాస్. అంటే తన మాటలను బట్టి సాహో హిందీ వెర్షన్ డబ్బింగ్ రూపంలో కాదు స్ట్రెయిట్ గానే తీస్తున్నారు అని మరోసారి క్లారిటీ వచ్చేసింది. ఇంకా అఫీషియల్ గా చెప్పలేదు కానీ సాహో కన్నా ముందే జిల్ ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ సినిమా చేయటం గురించి గట్టిగానే ప్రచారం జరుగుతోంది. కానీ దానికి మాత్రం దాటవేత సమాధానం చెబుతున్న ప్రభాస్ సాహో ఎప్పుడు విడుదల అవుతుంది అనేది మాత్రం చెప్పలేకపోతున్నాడు. సంక్రాంతి రేసులో ఉండొచ్చు అనే ఊహాగానాలు ఉన్నాయి కానీ దాదాపు ఆ ఛాన్స్ లేనట్టే .

## రేణుదేశాయ్ తోడు దొరికింది



పవన్ కల్యాణ్ నుంచి విడాకులు తీసుకున్న తర్వాత పిల్లలతో ఇన్నాళ్లు ఒంటరిగా జీవిస్తూ వచ్చింది రేణుదేశాయ్ తన జీవిత భాగస్వామిని సెలక్ట్ చేసుకున్నట్టు అనిపిస్తోంది. ఈ విషయాన్ని రేణూనే స్వయంగా ప్రకటించింది. ఓ వ్యక్తి చేతిలో తన చేయి వేసి ఉన్న ఫొటోను రేణు పోస్ట్ చేసింది. ఆ వ్యక్తి ఎవరనే విషయాన్ని ఆమె బయటపెట్టలేదు. కానీ ఆ వ్యక్తిపై తనకున్న ప్రేమను మాత్రం ఓ అందమైన కవిత రూపంలో ఆవిష్కరించింది. "ఇన్నాళ్లూ స్వచ్ఛమైన ప్రేమ కోసం ఎక్కడెక్కడో వెదికాను. ఎట్టకేలకు నా ప్రేమను నీలో చూస్తున్నాను. నా చేయి ఇలానే పట్టుకో. ఎప్పటికీ విడిచిపెట్టకు." ఇలా తనలోని ప్రేమను, భావావేశాన్ని కవిత రూపంలో బయటపెట్టింది రేణుదేశాయ్. ఇన్‌స్టాగ్రామ్ లో రేణుదేశాయ్ పెట్టిన పోస్ట్ కు ప్రశంసల జల్లు కురుస్తోంది. కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్న రేణుదేశాయ్ కు ఎంతోమంది శుభాకాంక్షలు చెబుతున్నారు. సెకెండ్ ఇన్నింగ్స్ లో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని కోరుకుంటున్నారు. తను ఓ తోడు కోరుకుంటున్నానని, తనకు కూడా ఓ జీవిత భాగస్వామి కావాలని కొన్నాళ్ల కిందట రేణుదేశాయ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆమె స్టేట్ మెంట్ పై అప్పట్లో పవన్ అభిమానులు భగ్గుమన్నారు. మళ్లీ మరో పెళ్లి ఎలా చేసుకుంటావ్ అంటూ సోషల్ మీడియాలో తిట్లు అందుకున్నారు. పవన్ అభిమానుల ఆన్ లైన్ వేధింపులకు ఏమాత్రం భయపడలేదు రేణుదేశాయ్. అంతే దీటుగా సమాధామిచ్చింది. తను రెండో పెళ్లి చేసుకుంటే తప్పేంటని బాహాటంగానే ప్రశ్నించింది. అన్నట్టుగానే తను త్వరలోనే పెళ్లి చేసుకుంటానని పరోక్షంగా తెలుపుతూ ఈరోజు ఈ ఫొటో పోస్ట్ చేసింది. రేణుదేశాయ్ ను పెళ్లాడబోయే ఆ వ్యక్తి ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

# డాలర్ ప్రభావం : వన్నె తగ్గిన బంగారం



**ముంబై :** పసిడి, వెండి ధరలు బలహీనపడ్డాయి. వివిధ కరెన్సీలతో పోలిస్తే..డాలరు 11నెలల గరిష్టానికి చేరడం, తదితర కారణాలతో అంతర్జాతీయంగా, దేశీయంగా పుత్తడి వెనుకంజలో ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు బలపడుతున్న కారణంగా బంగారం ధర దిగి వస్తోందని బులియన్ ట్రేడర్ల విశ్లేషణ. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర తాజాగా ఆరు నెలల కనిష్టానికి చేరింది. ఇటు దేశీయంగానే ఇదే ధోరణి నెలకొంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు క్షీణించడంతో దేశీయంగానూ ఆ ప్రభావం కనిపిస్తోంది. ఎంసీఎక్స్‌లో గోల్డ్ ఆగస్ట్ ఫ్యూచర్స్ 10 గ్రాములు రూ. 131 నష్టపోయి రూ. 30,650 వద్ద ట్రేడవుతోంది. వెండి కేజీ రూ.136 నష్టంతో రూ. 39,490కు చేరింది.అంతర్జాతీయంగా ప్రస్తుతం న్యూయార్క్ కామెక్స్‌లో ఔన్స్(31.1 గ్రాములు) బంగారం 10 డాలర్లు(0.8 శాతం) క్షీణించింది. ఆగస్ట్ డెలివరీ 1264 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. స్పాట్ ధర అయితే 0.4 శాతం వెనకడుగుతో 1263 డాలర్లకు చేరింది. వెండి సైతం 0.6 శాతం నీరసించి 16.21 డాలర్లను తాకింది. 2017డిసెంబర్ నాటి స్థాయికి చేరాయి.అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఫండ్స్ రేట్లను 1.75నుంచి 2 శాతానికి పెంచడంతో డాలరుతోపాటు బాండ్ల ఈల్డ్స్ ఊపందుకున్నాయి. ఈ ఏడాది మరో రెండుసార్లు ఫెడ్ వడ్డన తప్పదన్నసంకేతాలతో డాలరు ఇండెక్స్ తాజాగా 11 నెలల గరిష్టానికి చేరింది. మరోపక్క బాండ్ల కొనుగోలు ప్రక్రియకు ముగింపు పలకనున్నట్లు ఈసీబీ ప్రకటించింది. మరోవైపు ప్రపంచంలోనే రెండోపెద్ద దిగుమతిదారు అయిన ఇండియాలో వరుసగా అయిదవ నెలలో మే నెలలో కూడా పసిడి దిగుమతి క్షీణతను నమోదు చేసింది.

## సీడ్‌యాక్సిస్ రోడ్డుపై రంజాన్ ప్రార్థనలు

**ఈద్గాకు స్థలం కేటాయింపుపై పాలకుల నిర్లక్ష్యం**




**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** నెలరోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు, నమాజ్ నిర్వహించి ఆనందంగా జరుపుకునే పండుగ రంజాన్. సీఎం చంద్రబాబు రాజధాని నిర్మించడానికి సుమారుగా 33 వేల ఎకరాలు ఇక్కడి రైతులు ఇచ్చినా, పండుగ జరుపుకునేందుకు ఈద్గాకు మాత్రం ప్రభుత్వం స్థలం కేటాయించక పోవడంపై స్థానిక ముస్లింలు, మతపెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వారు సీడ్ యాక్సిస్ రోడ్డుపైనే రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చామని ఈద్గా నిర్వహించకోవడానికి స్థలం కేటాయించడంలేదన్నారు. ఎన్నోసార్లు తాము అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. ఈద్గా కోసం గత 4 ఏళ్ళుగా ఎన్ని అభ్యర్థనలు పెట్టుకున్నా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించి ముస్లింల బాధలను అర్థం చేసుకోవాలని వారు కోరుతున్నారు.

## ఎస్ ఆర్ ఎం లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ ఆర్ ఎం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గురువారం ఉదయం యోగసనాల అభ్యాసన జరిగింది. విశ్వవిద్యాలయం విద్యార్థుల వ్యవహారాల విభాగం అధిపతి రానా విక్రం సింగ్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుండి జరిగిన యోగాభ్యాసనలో పలువురు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న గేమింగ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న ఫిన్లాండ్ దేశానికి చెందిన ప్రొఫెసర్లు కూడా యోగాభ్యాసన కార్యక్రమంలో పాల్గొనడం యోగ పట్ల వారికి గల అభిమానాం వ్యక్తమయ్యింది.

## 26 నుంచి విశాఖలో జనసేన పోరాట యాత్ర



**హైదరాబాద్ :** జనసేన అధినేత ఆర్వర్యంలో ఈనెల 26 నుంచి విశాఖ జిల్లాలో పోరాట యాత్ర కొనసాగుతుందని పార్టీ వర్గాలు తులిపారు. ముస్లిం బాడీగార్డుల కోసం రంజాన్ పండుగ సందర్భంగా విశాఖ జిల్లా యాత్రకు పవన్‌కళ్యాణ్ విరామం ఇచ్చిన సంగతి తెలిసిందే. మూడు నెలలుగా వేధిస్తున్న కంటి సమస్యకు ఈనెల 24న చిన్నపాటి శస్త్రచికిత్స చేయించుకున్న వెంటనే పవన్‌కల్యాణ్ యాత్రను ప్రారంభించనున్నారు. ఈ యాత్ర నాలుగురోజులపాటు విశాఖ జిల్లాల్లో కొనసాగుతుందన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించడంతో పాటు ఉత్తరాంధ్ర మేధావులతో కూడా ఆయన ఆయన సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయి.

## సచివాలయంలోని నలిగిపోతున్న మహిళా కార్మికులు

**రాజధాని ప్రతినిధి, సచివాలయం :** సచివాలయంలో హౌస్ క్లీనింగ్ కార్మికులపై దుర్భాషలాడుతున్న 'యస్‌కెయస్' కంపెనీ సూపర్ వైజర్, కార్మికులపై ముఖ్యంగా ఆడవారిపైకి రావటం, అసభ్య పదజాలంతో తిట్టడం, అదేమంటే ఉద్యోగం లోంచి తీసివేస్తాం అని భయపెట్టున్నారని వర్కర్లు చెప్తున్నారు.ఇటీవలే రాజధాని వార్తలు ప్రచురించిన వార్తకు స్పందించి రెండు నెలల జీతాలు యస్‌కెయస్ సంస్థ ఇచ్చిందని, ఇంకా రెండు నెలల జీతాలు రావాలని వర్కర్లు వాపోతున్నారు. గౌరవంగా తమ పనులు చేసుకుంటున్నామని అయినా కూడా తమను తిట్టి అవమానిస్తున్నారని వర్కర్లు ఆవేదన చెందుతున్నారు.

## త్వరలో కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన

**రమేష్ నాయుడు**



**న్యూఢిల్లీ :** ఎన్నికలలోపే కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రమేష్ నాయుడు అన్నారు. విభజన హామీలను పూర్తిగా నెరవేర్చాకే ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కడప ఉక్కు పరిశ్రమకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తారని, మరో నెల రోజుల్లో తేదీ కూడా ప్రకటిస్తామని తెలిపారు.బీజేపీకి క్రెడిట్ రాకూడదనే విధంగా తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ వస్తే తెలుగుదేశం మనుగడ కష్టమని ప్లాంట్ రాకుండా అడ్డుపడుతోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ఆయన ప్రశ్నించారు.

## మైనార్టీలకు స్వర్ణయుగం


**మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ హిదాయత్**



**రాజధాని ప్రతినిధి, సచివాలయం :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన మైనార్టీలకు స్వర్ణయుగం అని మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఎండి హిదాయత్ వర్ణించారు. సచివాలయం 4వ బ్లాక్ పబ్లిసిటీ సెల్ లో బుధవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తరువాత రెవెన్యూ లోటు ఉన్నప్పటికీ ఆ ప్రభావం మైనార్టీలపై పడకుండా వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గడచిన 4 ఏళ్లలో మైనార్టీలకు రూ.2480 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2018–19లో రూ.1106 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. జనాభా ప్రాతిపదికన చూస్తే దేశంలో ఏ రాష్ట్రం ఇన్ని నిధులు కేటాయించలేదన్నారు. అందువల్ల చంద్రబాబు నాయుడుని మైనార్టీలు ఆత్మీయ బంధువుగా భావిస్తారని పేర్కొన్నారు. మైనార్టీలకు అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. దుల్హన్ పథకం, రోషిణి పథకం, దుకాణ్–మకాన్ పథకం, ఇమామ్ లకు గౌరవ వేతనం, స్కాలర్ షిప్ పథకం వంటివి అందజేస్తున్నట్లు తెలిపారు. విదేశీ విద్య కోసం ప్రస్తుతం ఇచ్చే రూ.10లక్షలను రూ.15 లక్షలకు పెంచినట్లు తెలిపారు. అందువల్ల మైనార్టీలు అందరూ సీఎంకు అండగా ఉంటారని చెప్పారు. రాజకీయంగా అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు ప్రధానిని నిర్ణయించే స్థాయిలో ఉంటారని చెప్పారు. ఆయన రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు. మైనార్టీ సమాజం సీఎంకు అండగా ఉండాలని కోరారు.


**రాజధాని అమరావతిలోని రాయపూడి గ్రామంలో గల గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో**
**ఏపీఎన్నార్టీ ఐకాన్ టవర్ భూమి పూజకు విచ్చేయుచున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రజా ప్రతినిధులకు,ఎన్ఆర్ఐలకు, ప్రజలకు స్వాగతం- సుస్వాగతం**




















Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com